# పరిమళ

కన్నెరికపు గదిలో కవి సార్వభౌముడు. అవును శ్రీనాథుడే. స్థలం ద్రాక్షారామ పురం. వేశ్యా వాటిక. పండు వెన్నెల రేయి...

"బాలా!" అని మృదువుగా పిలిచాడు శ్రీనాథుడు. తెర చాటున అణిగి నిలుచున్న ఎలజవ్వని మరింత ముడుచుకు పోయింది.

"నీ పేరే యవనిక అన్నారు. నీకు మరొక యవనిక కావలెనా?..." అని మరింత సున్నితంగా తెరల పొరలు తొలగించి చూసి విస్మయంతో కళ్ళప్పజెప్పాడు రసికనాథుడు. పండు వెన్నెలలో కర్పూరం చందనం సన్నజాజులు మేలవించి చేసిన అపరంజి బొమ్మవంటి కుమారీ మణి యవనిక సోయగం ఆ రసిక వతంసుని హృదయంలో తన్మయత్వపు మత్తుమందు చల్లింది.

"ఓహో! ఏమి లావణ్యం! దేవ కాంతల కైనా అసాధ్యం...ముగ్ధ మోహనం...సుమ పేశలం... బ్రహ్మ సృష్టికే మరో మధుర నీరాజనం...బాలా! యవనికా! మా జన్మ ధన్యం...!" మరొక్క అడుగు ముందుకు వేశాడు.

వడగాలికి చివురాకు వడలిపోయినట్టు హడలి పోయింది బాల. మరొక్క వెనుకడుగు వేస్తూ శిరస్సు అధో ముఖమై భయంతో కంపిస్తూ ఉంది. వివశత్వమా?

వధూ ప్రసాదన రసికునికి వేరుగా చెప్ప వలెనా? ఇది కేవలం బాల. ముగ్ధత్వం ఇప్పుడే మొగ్గ తొడుగుతున్న తొలి యౌవనపు అలజడి అనుమానం కలగలిసిన కల్హార మాల. ఇటువంటి కన్నెను మచ్చిక చేసుకుని మెచ్చుకోలు పొందినప్పుడు కదా రసిక పురుషుని జీవితానికి సార్థక్యం!

"బాలా! మీ ఊరికి స్వంతమై జగత్తుకే ఆరాధ్యుడై మహా మహిమాన్వితుడైన భీమేశ్వరస్వామి మీద ఆన...నీకు ఎటువంటి ఎగ్గుగాని తలపెట్టే వాడను కాను కదా! మరి ఈ సిగ్గుల ముగ్గులకు పగ్గములు వేయవలసినది నీవే..." అంటూ మెల్లగా మాటల్లో పెట్టాడు. అటు ఇటు పచారు చేస్తూ

సంభాషణ కొనసాగించాడు. ఓరగంట ఆమె ముఖ కవళికలు శరీర లావణ్య సంచలనములు గమనిస్తూ ఉన్నాడు.

"యవనికా! మీ ఊరు మాకు క్రొత్త కాదు. మీ వారూ క్రొత్త కాదు. అయితే మీ ఇంటి వైపులకు ఎన్నడూ రాలేదు. అంత అవసరము కలుగలేదనుకో... కాని ఈ మారు పొలిమేరలలోకి రాగానే మీ అవ్వగారు అమ్మగారు పంపిన తగు మనుషులు తెచ్చిన వర్తమానం ఆహ్వానం మా మనస్సునకు విందు చేసినవి... యవనిక అనే మధుర నామధేయం కల బాలామణితో కన్నెరికపు శోభనం అంటే..."

గల్లు మన్నాయి గాజులు. యవనిక మరొక అడుగు వెనుకకు వేసి మరొక అడుగు వారకు వెళ్ళింది.

"సహజమే!" అని విలాసంగా నవ్వాడు శ్రీనాథుడు. "శ్రీలక్ష్మి లాంటి చిన్నదాని కైనా సిగ్గే సింగారం...ఇప్పుడు ఇంత సిగ్గు పడే దానవు...మరి మీ మనుషుల ద్వారా కప్పురపు విడెము పంపలేదో? ఆ పంపినది నువ్వు కాదో?..."

తొలిసారిగా తలెత్తి చూసింది. కళ్ళు వారగా చూసింది యవనిక. లక్ష నక్షత్రాలను వెలిగించే చూపు అది.

"ధన్యోస్మి" అనుకోవడమే కాదు పైకే అనేశాడు శ్రీనాథుడు.

"ఆహా...ఎంత వెన్నెల! ఏమి సొగసు! ధన్యం...!" అంటూ మైమరపుతో కన్నులు అరమోడ్చి యవనికా సౌందర్యాన్ని నఖశిఖ పర్యంతం తనివి తీరా చూసుకున్నాడు.

"బాలికా...నువ్వే మరిచిపోయినావో?...మహాకవి సార్వభౌములు మా ఇంటికి వస్తే నా జీవితానికే మన్నన...దయచేయండి...అనుగ్రహించండి... అని నువ్వే స్వయంగా చెప్పమన్నావని మీ మనుషులు పాఠం అప్పజెప్పినారు... మరి అది నిజము కాదో?...వారి కల్పన అనుకోవలెనా?...సందేహించక నిజమేదో చెప్పవచ్చును..." గుచ్చి గుచ్చి చూస్తూ పరిశీలిస్తున్నాడు మహాకావ్య నిర్మాణ చతురుడు.

ఒక్క కదలిక ఒక్క చూపు ఒక్క శిరఃకంపం చాలును మనస్సు తెలుసు కోవడానికి. రవి గాంచనిచో కవి గాంచునే కదా! అని ఊరికే అన్నారా?

"అవును" అన్నట్టే తల తిప్పింది యవనిక. అమ్మయ్య అనుకున్నాడు శ్రీనాథుడు. అయితే ఈ బాలామణి మనస్సులో తనమీద పుష్కలమైన అభిమానకాంక్షలు ఉన్నట్టే కదా! స్పష్టం. కన్నెరికమునకు రమ్మని కన్నె స్వయముగా

విడెము పంపడం చాలా అరుదు. మహత్తరమైన విశేషం. రాజ సన్మానం కన్న కనకాభిషేకం కన్న ఘనమైన జీవిత సాఫల్యం!

"మరి అంతగా కోరి పిలిపించుకున్న చిన్నదానవు...పసి నెరజాణవు... ఇంతగా తొలగిపోవడం ఎందుకూ?...మనం చెలిమి బంధువులమే కదా... దా... మరీ..." అంటూ పువ్వును తాకినంత సున్నితంగా స్పృశించాడు ఆమెను.

హడలి పోయింది. వదిలించుకుందా మనుకుంటే భయం... మొహ మాటం...ఎట్లా అయితే నేమి మరి కొంత సేపటికి నెమ్మదిగా పానుపు దగ్గరికి నడిపించి కూచో బెట్టుకున్నాడు శ్రీనాథుడు. ఒక్కటి మాత్రం మహాకవి మనస్సు కెక్కింది. ఇది పసికూన. వలపు పోడుములే తెలియని అమాయకురాలు. రసిక గాథలు వినడం వల్లనో కవితాభిమానం చేతనో తన మీద ఇష్టపడి ఉండాలి. ఏది ఏమైనా ఈ కన్నెరికపు రాత్రి ఈ వెన్నెల రాత్రి ఈ కన్నె సొగసుల హొయి మధురిమ అంత తేలికగా అందిపోయే అమృత మేమీ కాదు. ఎంతో చాతుర్యం ఉండాలి. ఎంతో రాసిక్యం అంతకు మించి మరెంతో ఓరిమి కావాలి. తొందరపాటు తగదు గాక తగదు. మరింత లాలనగా యవనికతో మధుర సంభాషణం సాగించాడు కవిసార్వభౌముడు...

"అయితే మహాకవిగా మాకున్న కీర్తి అంతో ఇంతో నీకు తేటతెల్లమే నన్నమాట..." అని ఆరా తీశాడు శ్రీనాథుడు.

"అవును...విన్నాను...చాలా మంది మీ గురించి కథలు కథలుగా చెప్పుకుంటారు. మీరు పద్యాలు చెబుతారనీ గ్రంథాలు వ్రాస్తారనీ...ఆడపిల్లల సోయగముల మీద చమత్కారంగా ఆశు కవితలు గుప్పిస్తారనీ..." కొంచెం బెదురు తగ్గింది. ఇప్పుడు యవనికకు మాటలు సుళువుగానే వస్తున్నవి.

"అయితే...మరుత్తరాట్ చరిత్ర... మేము రచించినది... తెలుసునా?..."

"ఆఁహాఁ...వినలేదు..."

"శృంగారనైషధము..."

"అదేమిటి? ఔషధమా?..." అన్నది బేలకళ్ళతో. ఆ కన్నుల వెన్నెలతో చల్లబడ్డాడు గాని లేకుంటే మహాకవికి ఆగ్రహం రావలసిందే...అంతలో చిరునవ్వూ చిమ్ము కొచ్చింది మహాకవికి. ఈ చిన్నది అన్నదీ నిజమే. మరి నైషధము విద్వదౌషధము కాదా!

"నైషధమే తెలియని దానవు...ఇక...కాశీఖండము భీమఖండము ఏమి

తెలిసుంటుంది నీకు?..." ఆయన పలుకుల లోని వ్యంగ్యం ముల్లు దిగినట్లు నొప్పించగా బిక్కమొగం వేసింది యవనిక.

"మన్నించండి...అవేమీ నాకు తెలియదు...కాని మీరు గొప్ప కవీశ్వరులని మా వాడలో చెప్పుకోగా విన్నాను...కొందరు అయ్యవార్లు మీ పద్యాలు చదువుతుండగా కూడా విన్నాను..."

"ఆహాఁ...ఏమి విన్నావో...మరి ఒక్క పద్యమైనా గుర్తున్నదా?..."

"ఎందుకు గుర్తు లేదూ?...ఇదిగో కంఠోపాఠం...

సిరిగల వానికి జెల్లును
తరుణుల పదునారు వేల తగ బెండ్లాడన్
తిరిపెమున కిద్దరాండ్రా?
పరమేశా గంగ విడుము పార్వతి చాలున్..." అని సరిగ్గా అప్పజెప్పింది యవనిక.

"చాలు చాలు...ఈ మాత్రము కవితా గంధమైనా అంటినది...కాని మన రసిక సారస్వత స్వారస్యం నీ దాకా చేరుకోవడం కష్టమే...పోనీ...నవ వసంత శోభలు విరాజిల్లే ఈ సీమలో మన శృంగార చాటువు ఒక్కటైనా నీ చెవిన పడలేదా?..."

క్షణాల్లో యవనిక ముఖములో ఎన్నెన్నో రంగులు మారినవి. చివరకు తేరుకున్నట్లు వెలుగుతూ చెప్పింది... "అదేమిటో మా వాడలో మా వాళ్ళు కొందరు వల్లె వేస్తూ నవ్వుతారు...నేనడిగితే అర్థం వివరించరు మరి..."

"ఏమిటది?..."

"మకరధ్వజుని కొంప ఒక చెంప కనిపింప చీర కట్టినదయా చిగురు బోడి..."

"హహ్హా..." అంటూ మనసారా నవ్వేశాడు శ్రీనాథుడు. ఆ అర్థం ఇంత వరకూ నీకు ఎవ్వరూ చెప్పలేదూ అంటే...సాక్షాత్తూ దాని కృతికర్తను నేను స్వయంగా నీకు వివరించడమే విధి నిర్ణయం...సిగ్గుపడక వినాలి మరి..." అంటూ వివరిస్తుండగా అర్థ రాత్రి చేరుతూ చంద్రుడు వెన్నెల మెట్లెక్కి పోయాడు...

భయం పోయింది. బెరుకు వదిలింది. పూర్వ మిత్రుల వలె ఇద్దరూ లలిత భాషణం సాగిస్తుండగా చనువు పెరిగింది. అదే అదను అని రసికనాథుడు శ్రీనాథుడు చిన్న చిన్న పొడుపు కథలతో యవనికను మరింతగా ఆకట్టుకున్నాడు.

చీరకట్టులో పరిపరి తెరగుల సొబగులు వివరించాడు. ఆ నెపముతో ఆమె ధరించిన చీని చీనాంబరాలతో యథేచ్ఛగా ఆడుకున్నాడు. ఆభరణముల విలువ తెలియజేస్తూ మృదు స్పర్శలతో ఆమె తనూ లావణ్యమును పరామర్శించాడు. పొరబాటున తగిలినట్టు ఆమె తొడపై చేయి అదిమి పెట్టి చనువును మరింత పెంచుకున్నాడు. ఎప్పుడు ఏమవుతున్నదో తెలియని ముద్దరాలు. తనూ లావణ్యమైతే పూలపంట వలె గుబాళిస్తున్నది కాని అనుభవ రసికతల పోడిమి తెలియనే తెలియదు. అందుకే ఆమె పాణితలమును శ్రీనాథుడు చుంబింపగా సంభ్రమంతో బెదిరిపోయింది. శ్రీనాథుడు ఆమె వదన సదనమును పరికిస్తూనే ఉన్నాడు. ఇంత బాగున్నది కాని ఈ చిన్నదాని అంతరంగమున కాంక్షాకీలలు ఇదివరకే రాజిల్లి ఉండవలె కదా? ఇప్పుడు తను ఇంతగా విశ్వప్రయత్నము చేయవలసిన అవసర మేమి?

"చిన్నారీ...కన్నెరికమే మీ గృహమునకు మహోత్సవము కదా... మరి ఈ గదిలో నేను చెప్పినట్లల్లా నడచుకొమ్మని మీ వారు చెప్పినారా లేదా?..."

"చెప్పినారు..."

"మరి...నీ అంతట నీకైనా...ఇష్టమే కదూ?...అందుకే నువ్వు స్వయముగా కప్పురపు విడెము పంపినావు కదూ?..."

"హుఁ..." అంటూ కుప్పగా ఒరిగి పోయింది యవనిక. అంతటి రసిక నాథుడు కూడా తికమక పడ్డాడు.

నీటిలో నీడనైనా జాడ తీయవచ్చును. ఆడదాని మనస్సున మర్మము బ్రహ్మాభేద్య మని అనుభవజ్ఞులు ఊరకే అన్నారా? అయినా మానవ ప్రయత్నము... తప్పదు...ఇక మాటల కన్న చేతల దారే మంచి దనుకున్నాడు శ్రీనాథుడు. అంతటితో రసపర్వం మలుపు తిరిగింది...

వలువల కన్న గొప్ప విలువ లున్నవి. వలువలు తొలగిస్తేనే అవి ప్రత్యక్షమౌతాయి. ఎన్నెన్నో యౌవన వైభవములు చూసిన కవి నేత్రములకు యవనిక సౌందర్య సీమలు నవశోభలతో విందు చేస్తున్నాయి.

వెన్నెలల చారలు తొంగి చూస్తున్న గదిలో రసిక రాజు ఆ ముగ్ధ బాలామణి సోయగములను తనివి తీరా దర్శిస్తున్నాడు. స్పృశిస్తున్నాడు. దర్శన యాత్ర తరువాత స్పర్శాపర్వం తడిపొడి చినుకుల వలె మొదలైనది. ఒక్కొక్క స్పర్శతో కన్నె లావణ్యం ఎన్నెన్ని పులకింతలు పోతుందో శ్రీనాథునికి అనుభవైక

వేద్యం. గత అనుభవా లన్నిటినీ మళ్ళీ తరచి తరచి చూసుకొని ప్రస్తుత లావణ్యములకు సరిచూసుకొని పరవశిస్తున్నాడు మహా రసికుడు.

అయితే ఏ స్పర్శకు ఏమవుతుందో అదివరకు అనుభవమే లేని యవనిక క్షణానికొక సంభ్రమంగా ఉలికి పడుతున్నది...సోలి పోతున్నది...వాలి పోతున్నది. వాలి పోయే బాలను కన్నులారా చూసుకోవడం కమనీయమైన అనుభవమే! ఇక తదుపరి ఆహ్వానిస్తున్నది రసరాజ్య పట్టాభిషేకం! ఇదే అదను అనుకొంటూ తొలి ముద్దుల పద్దు మొదలు పెట్టాడు రసికవతంసుడు. ఇక తొంగి చూసినా బాగుండదు అన్నట్టు వేగంగా వెళ్ళి పోతున్నాడు చంద్రుడు...

శ్వాసలు మెలి పడుతున్నాయి. యవనిక తనువు యౌవన ధనువు శ్రీనాథుని చేతులలో మదనుని పువ్వుల విల్లుగా మారి విరుచుకు పడి మెలికలు తిరుగుతున్నది.

యవనికకు ప్రపంచమే పరిభ్రమిస్తున్నది. పువ్వుల జలపాతం నుంచి సంగీత కాంతులు ముమ్మరంగా ముసురుకుంటున్నాయి. ఏమౌతున్నదో తెలియని దశలో అంతా ఆయనే అయేట్టు ఉన్నాడని మాత్రం అనిపించింది.

మరపు మత్తుకు పూర్తిగా లొంగి పోయే ఘట్టంలో ఎక్కడి నుంచో ఎవ్వరో గుర్తు చేసి పిలిచినట్టు అదిరి పడింది. ఆమె తనూ వైభవాన్ని పరిపూర్ణంగా చూసుకుని మదనయాత్రకు మనసైనాడు శ్రీనాథుడు. ఇక క్షణమే క్షణమే అనుకున్నప్పుడే...సరిగ్గా ఆ క్షణంలోనే ఆమె కళ్ళ వెంట అశ్రువులు దొర్లుకు వచ్చాయి...భోరున ఏడ్చింది యవనిక. పచ్చి రోదన. ఇంత కాలం పదిలంగా దాచుకున్న పెన్నిధిని కోల్పోతున్న ఆవేదన...హృదయ విదారకంగా ఉంది ఆ విషాద వదనం...

తటాలున ఆగి పోయాడు శ్రీనాథుడు. శృంగార యాత్రకు ఆదిలోనే హంసపాదు.

"ఏమైందీ?..."

చెప్పదు. ఏడుస్తూనే ఉంది. ఆపదు. ఏడుపు ఆగదు.

చంద్రుడు ఎర్రబారిన ముఖంతో వెళ్ళిపోతూనే ఉన్నాడు...

విసుగు వేసట తెలియని రసికుడు కాబట్టి ఇంకా మధురంగా మృదువుగా మాట్లాడాడు.

"ఏమైనది చిన్నారీ? మీ చెలిమికత్తె లెవ్వరైనా తలపునకు వచ్చినారా?..."

ఏడుపు ఆపకనే లేదన్నట్టు తల ఊపింది.

"మరి ఇంకా భయం తీరలేదు కాబోలు...ఎందుకూ భయపడడం?... నేను నీకు నచ్చిన వాడనే...నువ్వు మెచ్చిన వాడనే...నువ్వు వీడియము పంపి రమ్మన్న వాడనే కదా?..."

"ఆc..." అంటూ ఇంకా రోదన స్థాయి పెంచింది.

"పోనీ ఇది చెప్పు...నా చేతలేమైనా నీకు వికారంగా అనిపించినవా?... నేను నీ కిప్పుడు నచ్చడము లేదని అనుకొందునా?..."

తల అడ్డంగా తిప్పుతూనే ఉంది. ఈ ప్రశ్న పరంపరతో తేలేది ఏమీ లేదని తెలిపోతున్నది.

"బాలా...నన్ను ఇంకా బాధించక అసలు సమస్య ఏమిటో చెప్పు...నీకు ఈ ప్రకారము కన్నెరికపు శోభనమే ఇష్టము లేదో?..."

"ఆc...లేదు లేదూ..." అని ఈమారు స్పష్టంగా పలికి ఏడుపు తెరలలో శోషిల్లింది యవనిక. "ఇష్టం లేదు...ఇదంతా వద్దు నాకు..."

సంభ్రమంతో స్థాణువు వలె నిలిచాడు శ్రీనాథుడు. హతాశు డైనాడు. అయినా మహాకవి. ఔచిత్యం తెలిసిన జీవిత వేత్త. కాబట్టి వెంటనే తేరుకున్నాడు. మృదువుగా యవనికను లేవనెత్తి బుజ్జగించి లాలించాడు. ఊరడించాడు.

"చిన్నదానా...నీకు ఇష్టం లేని దేమీ జరుగదు...జరుగబోదు...ఇది మా ప్రమాణం...సరేనా? ఇక నిర్భయంగా ఉండు...ఏడుపు ఆపు...కన్నెరికమే ఇష్టం లేక పోతే మరి స్వయంగా వీడియము పంపి మమ్ములను ఎందుకు ఆహ్వానించినట్టూ?..."

"ఆc..." అంటూ మరొక రోదనా స్వరాన్ని వెలువరించి కడలి తరగ వలె విరిచి చెప్పింది యవనిక..."కస్తూరి కోసమనీ..."

"ఏమీ!.." చెవులనే నమ్మ లేక పోయాడు శ్రీనాథుడు. "కస్తూరి కొరకు కన్నెరికమా?..."

"అవును స్వామీ...కస్తూరి అంటే నాకు ప్రాణం...మా ఇంట ఏ వీసమో లేశమో ఉన్నా పెద్దలు నా దాకా రానివ్వరు...కనకమిచ్చి కొనబోయినా... అంత సులభం కాదు కదా?...కస్తూరి దొరకడం మాటలా?..."

"ఓహో...అయితే..."

"మీరు నానా రాజసందర్శనం చేసి కొల్లగా కస్తూరి కానుకగా

తెచ్చుకుంటారట...మీకు మనసైన మగువలకు...మీరు మెచ్చి మిమ్ములను మెప్పించిన వయ్యారులకు...కస్తూరి ఇచ్చి వెళ్తుంటారట...మా వాడలకు మీరు వచ్చి వెళ్ళిన మరునాడు మీ కస్తూరి కథలే గుబాళిస్తాయి స్వామీ...అందుకే మీతో ఒక్క రేయి గడిపితే ప్రొద్దున్నకు కస్తూరి మిగులుతుందనీ...ఇందుకు సరేనని...ఒప్పుకున్నాను...అంతేగాని నాకు ఇంకే మక్కువా లేదు...నిజం స్వామీ ...మీకు విసుగు తెప్పించి నందులకు మన్నించండీ..." అంటూ యవనిక శ్రీనాథుని పాదాల మీద పడింది. శక్తి లేకున్నా వెక్కిళ్ళతో విలపిస్తూ ఉంది.

రసిక నాథుడు శ్రీనాథుని హృదయం జల్లుమన్నది. "బాలా...లే..." అన్నాడు.

"వద్దు లెండి స్వామీ నాకు వద్దు...కస్తూరి వద్దు లెండి... నన్ను నన్ను గానే ఉండ నివ్వండీ..."

"ఓహో...మా ముద్దు తీర్చవు గనుక నీ ముద్దు సైతం...మేము రద్దు చేసుకొనవలేనా?...అంతేనా...పిచ్చిదానా...కవి రాసిక్యం అంటే శరీర కాంక్ష అనుకున్నావా?...నువ్వు నువ్వుగానే ఉండిపో...కాని నేటి నుంచి నా మనస్సులో కన్నె కస్తూరిగా పరిమళిస్తూనే ఉంటావు...సరేనా..."

మరి కాస్సేపటికే భీమేశ్వరాలయం నుండి ఘంటారావం వినిపించింది. "శివుడు పిలుస్తున్నాడు..." అని నిష్క్రమించాడు శ్రీనాథుడు.

తెల్లవారగానే శ్రీనాథుని పరిజనం వచ్చి యవనికకు ఒక కానుక అందించారు. అది ఒక అందాల వెండి భరిణె. తెరవగానే కమ్ముకున్నది కస్తూరీ పరిమళం! మహాకవి మనస్సే ఆవరిస్తున్నట్టు పరవశంగా కళ్ళు మూసుకున్నది యవనిక. శృంగారం అంటే ఏమిటో మనస్సుకే తెలిసింది. ఆమె మనస్సుకే తెలిసింది. ఆమె మనస్సు ఏమవుతున్నదో ఆమెకు అప్పుడే తెలిసింది.

ఆ సౌరభమే శ్రీనాథుని కృతులలో చేరుకున్నది. నేటికీ కస్తూరీ పరిమళాలు గుబాళిస్తూనే ఉన్నవి...

ఈ కథా కల్పనకు ప్రేరణ శ్రీనాథుని పద్యం:
అక్షయ్యం బగు సాంపరాయణి తెలుంగాధీశ కస్తూరికా
భిక్షాదానము సేయరా సుకవిరాట్ బృందారక శ్రేణికిన్
ద్రాక్షారామ పురీ విలాస వర గంధర్వోప్సరోభామినీ
వక్షోద్వయ కుంభికుంభములపై వాసించు తద్వాసనల్

05.03.2004 సంచిక